504098601

# ప్రబోధ 19

వివిధ శాస్త్రచయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చ లేవు
తెరకు ఇవల జీవి దేవుడవ్వల నుండు
కార్యమివల, నవల కారణంబు.
మనసునందు మంచి మాటలందున మంచి
నడతలందు మంచి పాడమకున్న
సాయి యెట్లు మెచ్చి సంతోషమును యిచ్చు
చెప్పరయ్య మీరె ఒప్పుకుందు.
ఫిల్ము ఆకార్డింగు ప్లేటును చూచిన
ఒక్కరీతిగానె పోసగి యుండు
సౌండు బాక్సునందు సవరించి చూచిన
పాటలెన్నొ విధము పలుకు చుండు.

అధ్యాపకులారా! విద్యార్థులారా!

పశుత్వము, దైవత్వము అను రెండు తత్వములతో కూడినదే యీ మనస్సు. కామ క్రోధాది అరిషడ్వర్గములకు లోనై దైవ ప్రసాదితమైన గతి, స్థితి, మతి సంపత్తిని సద్వినియోగ పరచుకొనక దుర్వ్యసనములకు లోనై, దుష్టుడై, దుర్గతిని పొంది పతితుడై పశువుకంటె హీనమై పోతున్నాడు. అట్లుకాక కాలమును, కాయమును, వర్తను సంపత్తిని, స్థితిని, గతిని, ధర్మబుద్ధితో ఉత్తమ భావములతో దైవము యొక్క దీక్షను నీతి నిజాయితీలతో, మానవత్వాన్ని, మానవత్వము కంటె మిన్నయైన దైవత్వాన్ని పొందటం యిది ఒక మార్గము. సత్సంకల్పములను పెంచి కొంతమందికి పంచి యిదే మానవుని యొక్క ప్రధానమైన ధర్మమని భావించి సర్వపదార్థములను సద్వినియోగ పరచుకోటం యిది ప్రధానమైన కర్తవ్యము మానవునకు. చూచుటకు మానవులందరు ఒక్కటే అయినప్పటికి ముండే ముండే మతిర్భిన్నః అని ఒక్కొక్కరి తలంపులు వేరుగా తమనడతలు వేరుగా, తమయొక్క మాటలు వేరుగా కనుపించుచున్నవి. ఈ మూడింటి యొక్క యేకత్వమును గావించి, దివ్యాత్మను చింతించి, మానవత్వమును సార్థకము చేసుకోటమే మనసు యొక్క ప్రధాన కర్తవ్యము. సంకల్పములు ఎట్టివో తన యొక్క స్థితిగతులు

కూడను అట్టివే. కనుక మానవుని యొక్క మంచి చెడ్డలు సంకల్పములపై ఆధారపడి వుంటున్నది.

ఈ సంకల్పములు రెండు విధములైన సంకల్పములుగా వుంటున్నవి. ఒకటి శుద్ధ సంకల్పము రెండవది అశుద్ధ సంకల్పము. ఎప్పుడు పరుల యొక్క దోషమును వెతకటము, పరులకీడును ఆశించటము, పరులను పీడించటము, పరులకు దుఃఖమును అందించటము, దివ్యత్వమును విస్మరించటము, అపవిత్రతను విశ్వసించటము యీ విధమైన చర్యలలో తన యొక్క సంకల్పములను యిమడ్చటము యిది అశుద్ధ సంకల్పముల యొక్క ప్రభావము. కాని యీ అశుద్ధ సంకల్పములు ప్రప్రథమములో తనకు ఆనందముగా కనుపించవచ్చును. తన యొక్క చర్యలు తనకు మంచివిగా కనుపించవచ్చును. కాని అవి ముస్ముందు చాలా ప్రమాదమునకు గురిచేయుచున్నది. ఇతరుల కీడును మనము తలపెట్టినప్పుడు అది కొంతవరకు యితరులకు కీడు చేయవచ్చును కాని ఎదురు తిరిగి యీ కీడును తలపెట్టిన వానికే అనేక విధములుగా కీడును చేకూర్చును. కనుక పరదూషణ, పరనింద, పరులను పీడించటము యిది మహాపాతకముగా మనము భావించాలి. కనుక సంకల్పముల యొక్క ప్రభావము మానవుని యందు క్షణక్షణము కనుపించుచున్నవి.

సంకల్ప వికల్పకాత్మకమ్ మనః అని మనస్సు యొక్క ప్రభావము సంకల్ప వికల్పములతో కూడటమే కాకుండా యీ సంకల్పములు నిరంతరము మననము చేయుచుండును. కనుక దుస్సంకల్పములకు మనము యేమాత్రము స్థానము యివ్వరాదు. పరుల క్షేమమును, పరుల ఆనందమును, లోక కళ్యాణమును ఆశించి దైవచింతన చేత సదాలోచనలు సచ్చింతనలు సలిపి జీవితము సద్గతికి మార్గము చూచుకోవాలి. ఇదే మనస్సు యొక్క ప్రధానమైన ఫలితము. సమస్త పదార్థములు కూడను సంకల్పముల యొక్క స్వరూపములే. పాంచభౌతికమైన యీ ప్రపంచము యీ దేహము సంకల్పము యొక్క స్వరూపమే. ఈ జగత్తంతయు సంకల్పము నుండియే ఆవిర్భవించినది. కనుకనే మనోమూలమిదం జగత్ అని జగత్తంతయు మనస్సు యొక్క స్వరూపమే. ఈ సంకల్పములు మనిషినుండి మనిషికి ప్రయాణము చేయవచ్చును. ఈ సంకల్పములు చాలా శక్తివంతమైనవి. ప్రపంచమునే స్తంభింపచేయగలవు. ప్రపంచమునే తన హస్తగతము గావించుకొనగలవు. ఈ ప్రపంచమునే కదిలించగలదు. ఇట్టి సంకల్పముల యొక్క ప్రభావము మనము గుర్తించుకొనక ఆవిర్భవించే ప్రతి సంకల్పములను నిత్యానిత్య విషయ పరిశీలన సలపక అన్ని సంకల్పములను మనము యేదో విధముగా స్వేచ్ఛగా వదలిపెడుతున్నాము. కనుకనే మానవుడు

అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు గురియగుచున్నాడు. ప్రతి సంకల్పము యొక్క దీనిని మనము చక్కగా విచారించి వినియోగించాలి.

ఒక్క మనస్సునందు వున్నది లోకంబు
తిక్క బట్టి నరుడు తిరుగవేల

అన్నాడు వేమన. తనయొక్క తత్వము తనయందే వున్నప్పుడు గుర్తించుకొనక వెలుపల ప్రపంచములో యెడో వున్నదని ప్రాకులాడుతున్నాడు పిచ్చిమానవుడు. సామాన్యమైన మానవుని కూడను మాధవత్వముగా రూపొందింపజేసేదే యీ సంకల్పము యొక్క ప్రభావము. పామరుని పరమహంసగా మార్చవచ్చు. మానవుడు మాధవత్వాన్ని పొందవచ్చు. నరుడు వానరుడుగా కావచ్చు. మనిషి రాక్షసుడుగా మారవచ్చు. ఈ అన్నింటికిని సంకల్పములే కారణములు. ఆనాటి పామరులు పరమహంసలవలె, మహర్షులవలె, యోగులవలె తయారు కావటానికి యేమి కారణము. వారి పవిత్రమైన సత్సంకల్పములే. సంకల్పములు యే యొక్క స్వరూపాన్ని చింతించునో తాదాత్మ్య భావన పొందుతుంటాయి యీ సంకల్పములు. మనము చెడ్డను సంకల్పించితిమా మనము చెడ్డ స్వరూపాన్ని పొందిపోతున్నాము. మంచినే చింతించిన మంచి ఆకారమును పొందుతున్నాము. కనుకనే బంగారమును కరగించి ఒక మూసలో పోసినప్పుడు కరగించిన బంగారమంతయూ ఆ మూస యొక్క ఆకారమునే చెందుతుంది.

ఆనాటి మహర్షులు నిరంతరము దైవత్వమునే చింతించుచూ దైవ చింతనల యందే తనయొక్క మనసు లీనము గావించుతూ కాలమును, కర్మమును, కాయమును దైవత్వమునకు అంకితము గావించటము చేతనే బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి తాను కూడను అట్టి స్థితిని అట్టి గతిని అనుభవించగలిగారు. యద్భావం తద్భవతి. ఎట్టిస్థితియో అట్టి గతి. కనుక మనము మంచిని తలచి, మంచిని చూసి, మంచిని చూచి మంచిని చింతించటము అత్యవసరము. మనిషిని నడుపునది మనసే. అట్టి మనస్సును పురస్కరించుకొనియే ప్రవర్తనలు రూపొందుతున్నాయి. కనుక మనసు చాలా ప్రధానమైనది. అయితే మనసుకు ఒక విధమైన దోషము వుంటున్నది. నేను వేరు దేవుడు వేరు అనేదే దాని యొక్క ప్రథమ దోషము. వేద శాస్త్ర యితిహాస పురాణములు, భగవద్గీత, బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు కూడను నీవే బ్రహ్మము, ఆత్మయే బ్రహ్మము అని బోధించుచున్నప్పటికిని యీ మానవుడు తన అజ్ఞానము విడువక నిరంతరము తాను వేరు దైవము వేరు అనే భేదభావమునకే గురి అవుతున్నాడు. సమస్త మత గ్రంధములు కూడను యేకత్వమునే బోధిస్తున్నాయి. ఏకమేవ అద్వితీయం బ్రహ్మ అనే సమిష్టి స్వరూపాన్ని సమస్త గ్రంధములు తెలుపుతూ వచ్చాయి. కాని యిట్టి సత్య

504098604

మును గుర్తించుకొనలేక తన స్వస్వరూపాన్ని దర్శించుకొనలేక దేహమే నేనను మహాప్రమాదమునకు గురౌతున్నాడు. మనిషిలో వున్న నేను అనే విశ్వాసముతో కూడిన భావము యీ సంకల్పము యీ విధమైన భావములతో కూడిన స్వరూపాన్ని చిత్ తత్వమును ఆత్మస్వరూపకమునగా విశ్వసించి ఆనందమును అనుభవించి పరులకు పంచటమే పవిత్రమైన చరిత్రల యొక్క స్వభావము.

అహం బ్రహ్మాస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ, తత్వమసి అనే మహావాక్యముల యొక్క అంతరార్థమును గుర్తించి యిట్టి సత్యసూక్తులను విశ్వసించి దీనిని ఆచరణ యందు వుంచినప్పుడే ఆత్మస్వరూపాన్ని గుర్తించుటకు వీలవుతుంది. ప్రాచీనకాలమునుండి మన భారతీయులు అనేక విధములైన ఆదర్శములను అనుభవించి యిందులో ప్రధానమైన, దానిని, సారాంశమును గుర్తించి గుణమే అన్నింటికంటె ప్రధానము, మూలము అని కూడను వారు అర్థము చేసుకున్నారు. ధనము కోల్పోయినా వారు అంత బాధపడేవారు కాదు. తన యొక్క ఆరోగ్యమును కోల్పోయినా కూడను వారు చింతించే వారు కాదు. ఏదో విధమైన కొన్ని కన్న కష్టములకు గురైపోయి యీ ఆరోగ్యమును, ధనమును కూడను ఆర్జించ వచ్చని భావించెడి వారు. కానీ గుణము పోయిన ప్రాణమే పోయినట్లుగా చింతించే వారు. కనుకనే యీనాటి ఆధునిక విద్యార్థులు, విద్యార్థినులు యీ మూడు సత్యములను గుర్తించి వర్తించటము అత్యవసరము. If wealth is lost nothing is lost. If health is lost something is lost. If character is lost everything is lost. ఈ సత్యవాక్యమును వారు ఆధారము చేసుకొని వారు జీవితమును కొనసాగిస్తూ వచ్చారు. కాని యీనాటి ఆధునిక విద్యార్థులు తమ యొక్క భావములను గుర్తించుకొనక మితిమీరిన స్వేచ్ఛకు దారినిచ్చి గతులను తప్పి మతులను చెరచుకొని దుర్గతిని అనుభవిస్తున్నారు. ఆనాటి పవిత్రమైన యీ సూత్రమునకు వెనుక దారిని పట్టిస్తున్నారు. ఒక కారుగానీ బస్సుగానీ ట్రైనుగానీ రివర్సుగేరు వేసి డ్రైవ్ చేసినప్పుడు అది వెనుకకు పోతుందిగాని ముందుకు పోదు. ఈనాటి విద్యార్థులు యీ రివర్సు గేరులోపల ప్రయాణము సలుపుతున్నారు. If character is lost nothing is lost అంటారు. If wealth is lost some thing is lost అంటారు. If health is lost everything is lost అంటారు. ఏమిటి యీ health కానీ health is wealth. health ఎందుకోసం వుండాలి. ఈ దేహమును సన్మార్గములో సత్కర్మలలో ప్రవేశించినట్టి యీ health అవసరమే. దుర్మార్గమునందు, దుష్ప్రవర్తనయందు ప్రవేశింప జేసే యీ దేహము వుండుటకంటె పోవటం మంచిది. మానవత్వమును సార్థకము చేసుకోలేని యీ దేహము నిరర్థకమనే చింతనే చాలా మంచిది. కనుక

504098605

దేహము యొక్క ఆరోగ్యము ప్రధానము కాదు.

మనసు యొక్క యోచన అత్యవసరమైనది. సత్సంకల్పములు మనము అభివృద్ధి పరచుకున్నప్పుడే యిది సన్మార్గములో ప్రవేశపెట్టుటకు వీలవుతుంది. ఆనాటి మహనీయులు ఒక్కొక్క విధమైన సంకల్పము కూడను ఒక్కొక్క ఉత్తమమైన మార్గములో వుపయోగపెడుతూ వచ్చారు. కోపము చాలా చెడ్డదని వారు భావిస్తూ వచ్చారు కానీ ఆ కోపము కూడను చెడ్డది కాదు. సమయ సందర్భములను పురస్కరించుకొని ఆ కోపము చాలా వుపకారిగానే వుంటుంది. క్షమ, కరుణ చాలా మంచివని భావించెడి వారు. కానీ ఆ క్షమ, కరుణలు కూడను ఆ సమయ సందర్భములను పురస్కరించుకొని వుపయోగించుకోవాలి. లేకుంటే క్షమ, కరుణ కూడను చెడ్డవి అవుతాయి. దూర్వాసుడు తన యొక్క కోపమును తపస్సుగా భావిస్తూ వచ్చాడు. ఆ తపస్సే అగ్నిగా విశ్వసిస్తూ వచ్చాడు. ఆ కోపమునే జలముగా విశ్వసిస్తూ వచ్చాడు. తపస్సు అగ్ని కోపము జలము. అయితే అగ్నిని జలము ఆర్పగలదు. కొన్ని కొన్ని సమయములందు జలమునందే అగ్నిని సృష్టించవచ్చు. కనుక జలమునందు అగ్ని, అగ్నియందు జలము విలీనమై వుంటున్నవి. వీటిని వుపయోగించుకొనే విధానములోనే మంచి చెడ్డలు రూపొందుతూ వస్తున్నాయి. స్వార్థరహితమైన కోపము కూడను చాలా ఉత్తమమైన మార్గమునే చేకూరుస్తుంది. ధర్మబద్ధమైన కోపము వుపకారమునే గావిస్తుంది. ఇతరుల యొక్క అజ్ఞానమును, అహంకారమును అసూయాది మమత్వములను దూరము గావించుటకై యీ కోపము కొంతవరకు వుపయోగపెట్టవలసి వస్తుంది. మహనీయుల కోపము అన్నిమంచినే చేస్తూవచ్చాయి. కారణము తాము స్వార్థరహితమైన భావముతో వుపయోగపెడుతూ వచ్చారు. మన పవిత్రమైన కార్యములు అభివృద్ధి పరచుకొనే నిమిత్తమై మానవుని యొక్క దుష్ప్రవర్తనను అణగద్రొక్కే నిమిత్తమై, అజ్ఞానమును, అహంకారమును రూపుమాపే నిమిత్తమై, పరులను రక్షించే నిమిత్తమై కొన్ని కొన్ని సమయ సందర్భములందు కోపము వుపయోగపెట్టవలసి వస్తుంది. దూర్వాసుని యొక్క కోపము అన్నియు మంచినే చేస్తూ వచ్చాయి. కనుక అతను స్వార్థరహితమైన దానిలో యీ కోపమును వుపయోగపెడుతూ వచ్చాడు. సత్యమును వీడక, ధర్మమును వుల్లంఘించక స్వార్థరహితమైన దానిలో కోపమును వుపయోగపెట్టినప్పటికిని యిది పవిత్రమైన మార్గములోనే ప్రయాణము సలుపుతుంది.

అదే విధముగనే శాంతి, క్షమ, కరుణ. ఇవి కొన్ని కొన్ని సమయములందు కొన్ని ధర్మములకు విరుద్ధముగా ప్రవర్తిస్తూ వస్తాయి. పరిపాలనాదక్షుడైన రాజు యీ దయ, యీ కరుణ, యీ క్షమయూ మూడింటిని తాను అవలంబించిన

తన పరిపాలనే స్తంభించి పోతుంది. తప్పు చేసిన వారినందరిని క్షమిస్తూ, దుర్మార్గులైన వారి నందరినీ కరుణిస్తూ దయతో వారిని చూస్తూ పోయినప్పుడు అతని యొక్క పరిపాలనా పద్ధతి పూర్తిగా పెడ మార్గము పడుతుంది. ఏనుగుకు అంకశమెట్లు ఆధారమో ప్రధానమో గుఱ్ఱమునకు కళ్ళెము యెంత ప్రధానమో, తప్పునకు శిక్ష కూడను అంత ప్రధానము. ఆ శిక్షనే లేకుండిన రక్షణే జరుగదు. కనుకనే మానవత్వములో కొన్ని సంకల్పములు ఉత్తమమని మనము భావించవచ్చు. కొన్ని సంకల్పములు చెడువని మనము విశ్వసించవచ్చు కాని మంచి చెడ్డల యొక్క ప్రభావములు మనసు పై ఆధారపడి వుంటున్నాయి. కనుక మనస్సు పరిశుద్ధమైన, స్వార్థరహితమైన భావము నవలంబించినప్పుడు సర్వము కూడను మంచిగానే రూపొందుతాయి. కనుకనే సంకల్పములయొక్క ప్రభావమును కూడను అతి సూక్ష్మముగా విచారించవలసి వస్తుంది. భౌతికముగా, ప్రాకృతంగా యీసంకల్పముల యొక్క స్వరూపాన్ని మనము విశ్వసించటము చాలా కష్టము.

హృదయమునందు ఎట్టి దుర్భావములు లేక సంకల్పములను పరిశుద్ధముగా మనము ఆవిర్భవింప జేసుకొని లోకాసమస్తా సుఖినో భవంతు అందరూ క్షేమంగా వుండాలి అనే సంకల్పములు మనము పోషించుకున్నప్పుడు సర్వము కూడను మంచిగానే వస్తున్నాయి. కనుక మన సంకల్పములు పుట్టిన తక్షణమే యిది మంచివా చెడ్డవా అనే విచారణ మనం సల్పాలి. నిరంతరము మన యొక్క చిత్తమునందు చెడు సంకల్పములనే అభివృద్ధి పరచుకొన్న మన జీవితమే చెడు మార్గములో ప్రవేశిస్తుంది. ఒక్కొక్క చిన్న విషయాన్ని మనము చక్కగా విచారణ చేసినప్పుడు యిది పరులకు చేసే అపకారమా లేక తనకు తాను చేసుకొనే అపకారమా అనే సత్యము మనం గుర్తించటానికి వీలవుతుంది. ఈనాడు యిద్దరు ఫ్రెండ్సుకు డిన్నరు చేయాలని అనుకున్నాము. కాని ఆయిరువురికే మాత్రమే కాదు యీడిన్నరు మనం కూడను భుజిస్తున్నాము. కాని మనం అనుకోటం యిది పరుల కోసం చేసినట్లుగా భావిస్తున్నాం. కాని పరులకోసం చేసిన దానిని మనం కూడను అనుభవిస్తున్నాము. అదే విధముగనే చెడ్డ కూడను పరుల కోసమని మనము చింతించిన ఆసంకల్పము మనను కూడను లభిస్తుంది. మనలను కూడను హింసిస్తుంది. ఒక దేశము నాశనమై పోవాలని సంకల్పించుకుంటాము. కాని దేశముతో పాటు, దేశములో మనము కూడా వున్నాము కాబట్టి మనం కూడా నాశనము కావలసి వస్తుంది.

కానీ సంకల్పము ఒక్కటైనప్పటికి యిది అనేక స్వరూపాన్ని ధరిస్తూ వుంటుంది. ఒక్కసంకల్పములోనే అనేక సంకల్పములు కూడను వుద్భవిస్తుంటాయి.

504098607

ఒక టీపార్టీ పెట్టాలని ఒక సంకల్పము వచ్చింది. టీపార్టీ అనేది ఒక్కటే సంకల్పము వచ్చింది. తక్షణమే ప్లేట్లు, సాసర్సు, పాలు, కాఫీ, బిస్కట్లు అన్నీ కూడను ఆవిర్భవిస్తున్నాయి. ఇంక స్నేహితులు వస్తున్నారంటే వాళ్లకు ఛైర్సు, టేబుల్సు, టేబుల్ క్లాత్ యివన్నీ కూడను సంకల్పముతో ఆవిర్భవిస్తున్నాయి. కనుక ఒక్క టీపార్టీ అనే సంకల్పము యింకా ఎన్నో పదార్థముల పైన సంకల్పము ఆవిర్భవింప జేస్తున్నాయి. సంకల్పములనేవి ఒక్కటిగా నీవు భావించవచ్చును. కాని అది అనేకముగా రూపుదాలుస్తున్నాయి. ఈ అనేక రూపములు దాల్చిన సంకల్పములు అనేక క్రియలనుసరిస్తున్నాయి. కనుక సంకల్పముల యొక్క ప్రభావాన్ని చక్కగా గుర్తించటము అత్యవసరము.

మనము మానవులుగా పుట్టినాము. మానవులయందు మంచి సంకల్పములే అభివృద్ధి పరచుకోవాలి. ఎందుకనగా అజ్ఞాన రహితుడు మానవుడు. కాని మనము అజ్ఞానము సహజమని భావిస్తున్నాము. కానీ యీ అజ్ఞానము నాకు సహజమని భావించటమే ఒక పెద్ద అజ్ఞానము. అజ్ఞానము నీ సహజము కాదు. అసహజము. లేకుండిన జంతూనాం నరజన్మ దుర్లభమ్. మానవ జన్మ దుర్లభమని చెప్పుటకు వీలులేదు కనుక ప్రాచీన కాలము నుండియు మానవుని యొక్క అభివృద్ధి కోసమని, మానవుని యొక్క వున్నతస్థితి కోసమని, ధర్మార్థ కామ మోక్షమనే చతుర్విధ పురుషార్థములను స్థాపిస్తూ వచ్చారు. ఇది దేశ సంరక్షణా కోసమని. మానవత్వమును దివ్యత్వమునకు వచ్చే మార్గము కోసమని. ఈ ధర్మము ప్రప్రథమములో వుండేది. వీటిని కొంతవరకు మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కానీ యీనాటి యువకులు ధర్మ మోక్షములనే తలాతోక మరచిపోతున్నారు. మధ్యనున్న మెండెమును బట్టి బాధపడుతున్నారు. మొదటిది ధర్మము. కడపటిది మోక్షం. ఈ రెండిటిని మనము విస్మరించి కేవలము మధ్యభాగమును పట్టుకొని మనము జీవిస్తున్నాము. అర్థకామములే ప్రధానమని భావిస్తున్నాము. ఈ అర్థకామములు ధర్మమయము కాకుండిన యీ అర్థకామములు మహాప్రమాదమును కలిగిస్తూ వుంటాయి. ధర్మము వున్న చోటనే వుండక తన స్థానమును వదలి అర్థమును చేరి ఆ అర్థమును ధర్మార్థముగా మార్చి యీ ధర్మార్థములు రెండూ చేరి కామము దగ్గర ప్రవేశించి, ధర్మమయమైన కామమును అనుభవించి యీ మూడు కూడను ఒకవిధమైన ధర్మమయమైనప్పుడు మోక్షము మనలను వరిస్తుంది. అర్థమును కూడను ధర్మమయము గావించాలి. మన వాంఛలు కూడను ధర్మమయము గావించాలి. అన్నింటి యందు ధర్మము అంతర్గతమై వుండాలి. ఈ విధమైన మార్గము అవలంబించినప్పుడే మన పురుషార్థములు సార్థకము గావించుకున్నవారమవుతాము. ఈనాడు పెండ్లిండ్ల యందు ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి అని యీ మూడిం

టిని గురించి చెబుతున్నారు గాని మోక్షమును విస్మరిస్తున్నారు. కనుక యీ ధర్మ మోక్షములు ప్రధానమైన లక్ష్యము నందుంచుకోవాలి. ఈ విధమైన లక్ష్యమును అర్థము చేసుకొని ప్రాచీనులు తమ జీవితము యొక్క గమ్యము చేరుతూ వచ్చారు. ఈ నాటి మానవులకు గమ్యమేమి అక్కరలేదు. ఏదో ఒక స్వేచ్ఛా విహారము సలుపుతూ ఎక్కడో ఒక చోట అంత్యమై పోతున్నారు. అది కాదు మానవుని యొక్క కర్తవ్యము. ఎచ్చట పుట్టెనో అచ్చటికే గుట సైజము ప్రాణి కోటికిన్. ఎక్కడనుండి వస్తిమో అక్కడకు చేరటమనేది మన యొక్క లక్ష్యమై వుండాలి. ఈ యొక్క గమ్యమును చేరుటకై సత్సంకల్పములు మనము పోషించుకోవాలి. ఎట్టి సాధనలు సలుపక పోయినప్పటికి సత్సంకల్పములు పోషించుకుని, సన్మార్గములో ప్రవేశించి సత్సంగమును చేరి మన యొక్క జన్మ సార్థకము గావించుకోవాలి.

దేహము నీటి బుడగ వంటిది. ఏనిమిషమో, ఏక్షణమో ఎక్కడ కూలి పోవునో, ఎక్కడ రాలి పోవునో. కనుక మన సంకల్పములు ఎప్పటికప్పుడు మంచి సంకల్పములుగా రూపొందింప చేసుకోవాలి. సంకల్పములు కలిగిన మానవునకు సర్వము తన హస్తగతమై పోతుంది. మనము చేసే సర్వకర్మలు సంకల్పముల యొక్క స్వరూపమే. సంకల్పమే లేకుండిన సర్వము శూన్యమై పోతుంది. కనుక జగత్తంతయు హిరణ్యగర్భుని వంటిది. ప్రథమ సంకల్పమే ప్రధానమైనది. అదే దీని ఆధారము అన్నారు. కనుక సంకల్పములను పవిత్రమైనవిగా మనము రూపొందింప చేసుకోటం చాలా అవసరము. కాని దుస్సంకల్పములను లోపల వుంచుకొని పైపైన మంచి ప్రవర్తనగా మనము నటించవచ్చు లేక బయటి ప్రవర్తనలు కొన్ని విధములైన దుర్మార్గముగా కనుపించవచ్చును. లోపల సంకల్పములు పవిత్రమైనవిగా రూపొందవచ్చు. అది ప్రయోజనము కాదు. మనస్సునందు, వాక్కునందు, క్రియ యందు యీ మూడింటి యందు యేకత్వము కావాలి. కనుక యిట్టి త్రికరణ శుద్ధితో చేసే సంకల్పమే ప్రధానమైన సంకల్పము. అప్పుడే పూర్ణమానవుడుగా రూపొందుతాడు. The Proper study of mankind is man. మన సంకల్పము, మన మాట మన క్రియ యీ మూడు ఏకమైనప్పుడే mankind. జగత్తులో అనేక విధములైన భిన్నత్వములు కనుపిస్తున్నవి. కాని యీ భిన్నత్వములో వున్న యేకత్వమును గుర్తించాలి. ఈ ఏకత్వములో వుండిన ఆనందము మనము చవిచూడాలి. అప్పుడే దివ్యత్వము అర్థము చేసుకున్నవారమవుతాము. ఈనాడు అనేకత్వములో వున్న యేకత్వమును గుర్తించక, ఏకత్వమును, అనేకత్వముగా మనము రూపొందింప జేసుకుంటున్నాము.

ఏ దేశమునందుగాని, ఏ కాలమునందుగాని యీనాడు మానవుడు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఏ మానవుడు శాంతి భద్రతలను

504098609

అనుభవించటం లేదు. కారణము తన నిండుకు దుస్సంకల్పములే. ఈ విధమైన దుస్సంకల్పములను మనము దూరము చేసుకోవాలి. ఈ వయస్సు చాలా పవిత్రమైన వయస్సు. ఎవరికి ఏది చేసినప్పటికి అది తిరిగి మనకు లభిస్తుంది అనే విశ్వాసమును మనము అభివృద్ధి పరచుకోవాలి. అట్టి విశ్వాసము వుండినప్పుడే మనము యితరులకు చెడ్డ చేయకుండా వుంటాము ఏదోయిప్పుడు చేయవలసినది మనము చేస్తాము తరువాత ఎప్పుడు వస్తుందో చూచుకుందాము అంటే అది చాలా తామసమై పోతుంది. ఇది కేవలము రజోగుణరూపకముగా రూపొందుతుంది. ఈ కామక్రోధములకు రెండింటికి పుట్టిన యిల్లు రజోగుణమే. ఈ రజోగుణమనేది మానవుని హతమారుస్తుంది. శుద్ధసాత్వికమైన సంకల్పముల చేత సాత్వికమైన మానవులుగా తయారు కావాలి. ఇదే నిజమైన విద్య. ఈ విద్యను మనము అభ్యసించినప్పుడే మనము ఆత్మవిద్యను కేవలము లౌకిక విద్యలందు కూడను మనము సక్రమమైన మార్గమును అవలంబిస్తాము. విద్యా-తపస్సుల రెండిటి యొక్క సమ్మిళితమే నిజమైన దివ్యత్వము. తపస్సనగా ఏమిటి? ఈ మూడింటి యొక్క యేకత్వమును చేయటమే తపస్సు. కేవలము ఎక్కడో అరణ్యమునకు వెళ్ళి ఏదో సహాలలో కూర్చొని దైవమును చింతించటము మాత్రమే తపస్సు కాదు. త్రిగుణములను యేకము గావించి, దివ్యమైన భావములతో ప్రవేశింప జేయుటమే తపస్సు. ఈ విధముగా త్రిగుణముల యొక్క యేకత్వమే గావించకుండిన యిది తమస్సుగా మారిపోతుంది. కనుక మనము తమస్స్వరూపులు కాదు. తపస్స్వరూపులు కావాలి. నిరంతరము సత్సంకల్పముల యొక్క తపమును ఆచరించాలి. ఆ సత్సంకల్పముల యొక్క తాపమే తపస్సుగా మారిపోవాలి. కనుక యీ సత్సంకల్పములను చాలా ఆధారమైనవిగా తీసుకొని అవి ప్రాణసమానముగా మనము విశ్వసించాలి. ఇవి సత్సంకల్పములుగా మనము తీర్చిదిద్దుకోవాలి. ఎవరికి యేసమయమునందు గాని, అపకారముగాని, కీడుగాని మనము తలంచరాదు. అందుకోసమనే చెడపకురా చెడెదవు. యితరుల చెడుపును మనము కోరుతుంటే మన చెడుపు కూడను మనకు సంభవిస్తుంది. ఒక బాల్‌ను తీసుకొని గోడకు గట్టిగా కొట్టినప్పుడు ఆ ball తిరిగి యెంత గట్టిగా కొట్టామో అంత వెనుకకు వస్తుంది. ఒకరి దోషాన్ని మనము చూపుతూ వస్తుంటే తిరిగి మూడు దోషాలు మనవి చూపుతుంది. వీడు చెడ్డవాడు అని ఒక వేలుతో వానిని చూపితే మూడు వేళ్లు నీవు చెడ్డ అని చూపిస్తాయి. ఈ సత్యాన్ని మనము చక్కగా గుర్తించి వర్తించాలి. నీవు మూడ విధములుగా చెడ్డవాడవై వుండి పరుల యొక్క ఒక్క దోషాన్ని చూపటానికి ప్రయత్నిస్తున్నావు. నీవు చూపేవాని దోషములకంటె యెక్కువ దోషములు నీలో వున్నాయి. ఎక్కువ దోషములు కలిగినవాడే పరుల దోషమును పరిక్షిస్తాడు. ఈ సత్యమును మనము

504098610

మనము చక్కగా గుర్తించాలి. కనుక ఎవ్వరిని మనము నిందించరాదు. ఎవరిని మనము బాధించరాదు. ఎవరి చెడ్డను మనము కోరరాదు. అందరి మంచిని మనము కోరుతూ రావాలి. అప్పుడే హృదయమునందు చక్కని పవిత్రమైన సంకల్పము అభివృద్ధి అవుతాయి.

కనుక మనస్సంటే సంకల్పముల యొక్క చేరికగా మనము గుర్తించాలి. మనస్సంటే మనిషే. మనిషంటే మనస్సే. మనస్సంటే సంకల్పములే. సంకల్పములనగా మన నిత్యజీవితములో మన యొక్క ప్రవర్తనలే. కనుక సంకల్పముల యొక్క పరిణామమే మన ప్రవర్తన. కనుక మనప్రవర్తన మంచిగా వుంటుండాలి. ప్రవర్తన మంచిగా వుండినప్పుడే ప్రపంచము మంచిదిగా వుంటుంది. కనుక మన వ్యక్తిత్వాన్ని మనము పోషించుకునే నిమిత్తమై ప్రవర్తన అతి పవిత్రమైనదిగా రూపొందింప జేసుకోవాలి. అదే character అన్నారు. character అంటే యేదో కొన్ని రకములైన మంచిగుణములు కలిగినంత మాత్రమున character కాదు. మన behaviour, మన habits, మన discipline ఇవన్నీ కూడను మన నడతలతో పాటు సక్రమమైనదిగా వుంటుండాలి. మన నడతలు మన మాటలు, మన చూపులు, మన వినికిడి, మన హృదయము అన్నింటి యొక్క పవిత్రతను చేకూర్చుకోవాలి. కనుకనే మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం అన్నారు. అదే మన characterకు సరైన గుర్తు. మనస్ అన్యత్, కర్మణ్ అన్యత్, వచస్ అన్యత్ దురాత్మనాం అన్నారు అదే మన చెడు మార్గములకు మూలకారణము. కనుక మన చూపును పవిత్రమైన చూపుగా రూపొందింప చేసుకోవాలి. ఎప్పుడు చూచినా మనము చెడ్డవిషయాలు వినటానికి ప్రయత్నించకూడదు. ఎప్పుడు మనము చెడ్డమాటలను ప్రవేశింప చేయకూడదు. ఈ విధమైన పరిశుద్ధమైన చిత్తముగా మనము రూపొందింప జేసుకోవాలి.

రామాయణమునందు కొన్ని చక్కని ఘట్టాలంతా వుంటున్నాయి. ఈనాటి యువకులు దానిని చక్కగా పాటించాలి. లక్ష్మణుని యొక్క characterను గురించి యెన్నో విధములుగా రామాయణము వర్ణిస్తూ వచ్చింది. పదునాల్గు సంవత్సరములు అరణ్యములో వంటరిగా వుండినప్పటికి సీతముఖము ఒక్కక్షణమైనా తాను చూచి ఎరుగడు. హనుమంతుని చేతికి చిక్కిన ఆభరణములు చూచినప్పుడు లక్ష్మణుడు చెప్పుతున్నాడు. అన్నా యీ కేయూరములు, యీ కర్ణములు తెలియదు. ఏనాడు చూడలేదు. ఇవి సీతవో కాదో తెలియదు. కాని కాలి అందెలు మాత్రము నాకు తెలుసు అన్నాడు నిత్యము పాదాభివందనం చేసే సమయంలో కాలి అందెలు చూచానుయికపోతే అదికూడ చూచి వుండేవాడిని కాదు. ఇదే కాకుండా ఒకానొక సమయములో ప్రపంచమునకు లక్ష్మణుని యొక్క పవిత్రతను ఆదర్శముగా నిరూపించే నిమిత్తమై రాముడు కొన్ని పరీక్షలకు

504098611

కూడను పూనుకున్నాడు. లక్ష్మణుని యొక్క పవిత్రత నాకు తెలుసు కాని లోకము యెరుగదు. ఒకానొక సమయములో రామ లక్ష్మణ సీతలు ముగ్గురు ఒక వృక్షము క్రింద విశ్రాంతి తీసుకుంటున్నారు. లక్ష్మణుని యొక్క పవిత్రతను ప్రపంచమునకు చాటే నిమిత్తమై రాముడు ఒక చిన్న యుక్తి పన్నాడు. లక్ష్మణా నేను కొంత బయలు ప్రదేశానికి పోవలసి వస్తుంది. నువ్వు యిక్కడే వుండు, యిది చాలా దట్టమైన అడవి రాక్షసుల మాయలు అనేక రకములుగా వుంటున్నాయి, కనుక నీవు యేమాత్రము కూడను కనురెప్పపాటు మాత్రం కూడను విస్మరించక సీతను మాత్రమే చూస్తూ వుంటుండు అని చెప్పాడు. ఇది లక్ష్మణునికి ఒక పరీక్షగా తోచింది. సీత పాదములనే చూస్తూ వున్నాడు. కొంత సేపు అయ్యేటప్పటికి ఆ వృక్షము మీద ఒక పక్షి వచ్చి వాలి వుంది రాముడు పక్షి రూపమును ధరించి వచ్చాడు. ఏ పక్షిగా వచ్చినా సరే, ఏ రాముడుగా వచ్చినా సరే నేను సీతను సరైన రీతిగా కాపాడుతూ రావాలని ప్రతిజ్ఞ చేసుకున్నాడు తాను. చెట్టు పైన వున్న పక్షి ఒక శ్లోకాన్ని ఉచ్చరించింది. అతి మధురమైన పండును చూచినప్పుడు, పరిమళమైన పుష్పమును మనము ధరించినప్పుడు, వంటరిగా ఒక యువతిని చూచినప్పుడు యువకుడు యే రీతిగా వుండగలడు అనే ఒక ప్రశ్న వేసింది. లక్ష్మణుడు దానికి జవాబుగా చెబుతున్నాడు. సుశీలవంతుడైన తండ్రికి, పతివ్రత యైన తల్లికి పుట్టిన యే మానవుడు కూడను దీనికి చలించడని జవాబు యిచ్చాడు. తల్లియందో, తండ్రియందో కొంత దోషము వుండిన వాడే యిలాంటి దాంట్లో అపవిత్రమైన భావాలకు గురి అవుతాడు గాని యిరువురి యందును శుద్ధమైన, పవిత్రమైన భావాలు వున్నప్పుడు ఏనాడు యిటువంటి అపవిత్రమైన భావములకు పాల్పడడు అన్నాడు. మరొక ప్రశ్న వేసింది చిలుక. మదగజము వలె మనసు సంచరించే సమయమునందు అనగా మంచి చెడ్డలను విస్మరించి కేవలము స్వేచ్ఛా విహారము సలిపే యీ సందర్భము లోపల యీ యువకుడు తాను యే విధమైన నిగ్రహము చేయగలడు అంది. మదగజమైనప్పటికిని స్వేచ్ఛా విహారము సల్పినప్పటికి జ్ఞానమనే అంకుశము చేత దానిని అరికట్టగలను అన్నాడు. ఈ జ్ఞానమనే అంకుశము కల్గిన వానిని యే మదగజము యేమీ చేయలేదన్నాడు. తక్షణమే చిలుక రామ స్వరూపాన్ని ధరించింది లక్ష్మణా! నీ నిమిత్తమే కాదు. నీ సత్యము నాకు తెలుసు. కాని లోకానికి వ్యక్తము గావించే నిమిత్తమై నేను యీ రకంగా నిన్ను పరీక్షించాను అన్నాడు.

కనుక యువకులైన వారు యిలాంటి పవిత్రమైన శీలము నభివృద్ధి పరచుకున్నప్పుడే నిజమైన మానవత్వాన్ని మనము పూర్ణము గావించిన వారమవుతాము మన విద్యాసంస్థ యందు ప్రధానమైన విద్య మన శీలపోషణే. అది లేని విద్యలు ఎన్ని వుండి ప్రయోజనమేమిటి? ఈ విద్యలన్ని చెత్త చదువులే. ఎన్ని శాస్త్ర యితిహాస పురాణములు మనము చదివినప్పటికి, ఎన్ని విధములైన ప్రాపంచిక రహస్యాలను గుర్తించిన వారమైనప్ప

టికిని గుణము లేక పోతే యిది ప్రయోజనము లేని జీవితమే. కనుక మన విద్యలతో పాటు మన గుణములు పోషించుకోవాలి.

సకల శాస్త్ర పురాణ సంగ్రహ వేత్తయై
వేదాంతములు నేర్చు విప్రుడైన
రక్తి యేపారగ రమ్య హర్మ్యంబుల
రమియించు రాజాధిరాజులైన
రణరంగ మందు పరాభూతరిపుడౌచు
వెల్గొందు జగదేక వీరుడైన
దారిద్ర్యదేవత దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్య విభుడగు దాసుడైన
గుణము లేనిచో ఎందుకు పనికి రాడు

అలాంటి గుణము లేనప్పుడు మన చదువులెందుకు? మన సంపద ఎందుకు? మన జీవిత మెందుకు? కనుక మన జీవితాన్ని, మన సంపదను, మన సర్వస్వాన్ని కూడను దానికి ధారపోసి దానిని మనం సంపాదించుకోవాలి. ఇదే మన ప్రధానమైన సంకల్పముగా మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ ఒక్క సంకల్పమును మనము అభివృద్ధి పరచుకుంటే సర్వాన్ని జయించిన వారమవుతాము.

ఈ యింద్రియాలను మనము నిగ్రహించుకోవాలి. చిన్న పిల్లవాడు ప్రహ్లాదుడు. మీ సోదరుని వంటివాడు. చిన్న పిల్లవాడు మహా రాక్షసుడైన హిరణ్యకశిపునికి చెప్తున్నాడు. తండ్రీ! లోకములన్నియు గడియలోన జయించిన వాడవు ఇంద్రియ లోకము చిత్తము గెలువ నేరవు. ఎన్ని జయించి ప్రయోజనమేమిటి? నీయొక్క యింద్రియాలు జయించలేనివాడవు ఎన్ని రాజ్యాలు జయించి ప్రయోజనమేమిటి? సముద్రాలను శోధించినాడు. భూమి నంతా త్రవ్వి శోధించినాడు. సర్వత్రా తాను పరమాత్మ ని యొక్క తత్వాన్ని పరిశీలించటానికి ప్రయత్నించాడు. సమస్త శక్తివంతుడు. అలాంటి హిరణ్యకశిపుడు కూడను యింద్రియములను జయించలేక పోయాడు. కారణము పశ్యతీతి పశువు. తన దృష్టినంతయు ప్రకృతిపైననే ఆధారపెట్టుకున్నాడు. బయట దృష్టిని మాత్రమే అభివృద్ధి పరచుకున్నాడు. అంతర్దృష్టిని యేమాత్రము చింతించదలేదు. కనుక మనము కూడను బయటదృష్టిని అలవరచుకున్నంత వరకు పశువులమే - పశువులమే - పశువులమే. ఏనాడు అంతర్భావములను మనము అభివృద్ధిపరచుకొందుమో ఆనాడే మనము చక్రవర్తులము. కనుక రాజాధిరాజ మహారాజ రాజైనవు

504098613

ఇంద్రియములను జయించుకుంటె నీవు అన్ని రాజ్యములకు రాజైన వాడవౌతావు అలాంటి వ్యక్తులు మన Institute లో తయారు కావాలి. ఈ విద్యతో పాటు వివేకము, వివేకము తో పాటు విచక్షణ, విచక్షణతో పాటు వినయము వినయము తో బాటు విద్యకూడను చేరినప్పుడే రాణిస్తాడు మానవుడు. వినయము లేని విద్య విద్యకాదు. విజ్ఞత లేని విద్య విద్యకాదు. కేవలము విజ్ఞానము వుండినంత మాత్ర మున ప్రయోజనమేమిటి? ఉపయోగము లేని విజ్ఞానము కంటెను వుపయోగపడే అజ్ఞానమే మేలు. అందువల్లనే నేను అప్పుడప్పుడు చెబుతూ వుంటాను. పండుపండని భూమి పది ఎకరము లేల? కొంచెమైన చాలు మంచి భూమి. మనము పెద్ద పెద్ద డిగ్రీలు ఆశించ నక్కరలేదు. నీవు A,B,C,D మొదలు కొని Z వరకు నీవు డిగ్రీలు తీసుకున్నప్పటికిని నీవు ఆచరణలో లేకుండినప్పుడు నీవు కేవలము ఒక శుంఠవే. ఏమిటి యీ విద్యలు. కుక్కలు కూడను విద్యలు నేర్పితే నేర్చుకుంటాయి. పూర్వకాలములో దున్నపోతు కూడను వేదము చెప్పిందట. కోతులిప్పుడు సైకిలు త్రొక్కటం లేదా నేర్పిస్తే. గొర్రెలు మేకలు కూడను సర్కస్‌లో ఎన్నోపనులు చేస్తున్నాయి. నేర్పిస్తే కేవలము నేర్చుకునే అప్పజెప్పే విద్యలు విద్యలవుతాయా? మనము ఆచరణలో పెట్టి యితరులకు ఆదర్శప్రాయముగా మనము జీవించాలి. అదే నిజమైన విద్య. ఆదర్శప్రాయమైన జీవితము మనము గడపాలి. ఎట్టి ఆదర్శము? ఉత్తమ ఆదర్శము. మానవునిగా మనం బ్రతకాలి. మానవునిగా జీవించాలి. మానవునిగా చావాలి. మానవునిగా పుట్టి, మనము రాక్షసునిగా మరణించరాదు.

కనుక మనము యీ సత్సంకల్పములను చక్కగా అభివృద్ధి పరచుకుంటె మనమే దైవ స్వరూపుల మవుతాము. మనము యేదో కొంత కాలము మాత్రమే ఆచరించటము కాదు. జీవిత పర్యంతము దీనిని అనుసరించాలి. ఈ గాఢ విశ్వాసము మనం పొందాలనుకున్నప్పుడు మనము దైవాంశమనే సత్యాన్ని మీరు విశ్వసించాలి. మీనుండి దైవము వేరని మీరు భావించరాదు. ఈ భావన మీయందు వుండినప్పుడు ఏ కొంత కాలమో మీరు భక్తిప్రపత్తులతో వుండవచ్చు. తిరిగి బయట ప్రపంచానికి పోతూనే మీరు నాస్తికులుగా తయారౌతారు. కనుక మనము యేక్షణమైనా కూడను, ఎక్కడ వుండినప్పటికి మనము దైవాంశలమే అనే భావాన్ని మీరు ధృడం చేసుకోవాలి. కనుక దైవాంశములైన మనకు దైవగుణములంతా మనలో రావాలి. నీవు పెడమార్గం పట్టవు. లేకుండిన ఏక్షణమైనా నీవు పెడ మార్గము పట్టవచ్చు. దుష్ట బుద్ధులకు నీవు కొంతవరకు లోబడవచ్చును. చేసిన ఉపకారము మరచిపోవచ్చును. ఉపకారికి అపకారము గావించవచ్చును. కనుక మొట్టమొదట నీవు యీ అంశమును గుర్తించుకొని నీ జీవిత యాత్రను

504098614

కొంతవరకు సాధించటానికి ప్రయత్నించటం చాలా ప్రధానమైన విషయమని నేను హెచ్చరిస్తూ నాప్రసంగాన్ని విరమిస్తున్నాను.